

కవాడిగూడ భాగ్యలక్ష్మినగర్‌లో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపాల్, జైసింహ



నల్లకుంట స్ట్రీట్‌లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ అమృత



కవాడిగూడ బండానగర్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు



సంజీవ్‌నగర్‌లో మట్టి వినాయకులను పంపిణీ చేసిన సోషల్ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్

మట్టి గణపతికి జై

నేడు వినాయక చవితి

- అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో బస్తీలు, ప్రాంతాలు, వీధులు, మార్కెట్లకు వినాయక చవితి కళ
- మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు



శివాలయం చౌరస్తా వద్ద డిజిటల్ లైట్లతో ఏర్పాటు చేసిన స్వాగత వేదికలు



భక్తుల పూజలు అందుకునేందుకు సిద్ధంగా ఉన్న ముషీరాబాద్ శక్తి యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన భారీ గణనాథుడు



శంకర్‌నగర్‌లో మట్టి గణపతుల విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లావణ్య, బీఆర్ఎస్ నేతలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ఎక్కడ చూసినా రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ, వివిధ దేవతామూర్తుల ప్రతిమల డిజిటల్ లైట్ల బోర్డులు, భారీ వినాయక మండపాలు, స్వాగత కమాన్‌లతో వీధులన్నీ అంగరంగ వైభవంగా కనిపిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని ముషీరాబాద్, అంబర్‌పేట ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్ అన్నారు. మట్టిగణపతి విగ్రహాలను ప్రతిష్ఠిద్దాం, కాలుష్యాన్ని నివారిద్దాం అని వారు పిలుపిచ్చారు. బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో భాగ్యలక్ష్మినగర్‌లో ఎమ్మెల్యే గోపాల్, నల్లకుంట స్ట్రీట్ నెంబర్ 14లో ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ యాకర అమృత ప్రజలకు మంగళవారం ఉచితంగా మట్టిగణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. జీహెచ్ఎంసీ, హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారని కార్పొరేటర్ రచనశ్రీ తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు కల్పిస్తున్నామని చిక్కడపల్లి ఏసీపీ రమేశ్‌కుమార్ తెలిపారు. మట్టి గణపతి విగ్రహాల పంపిణీ, మండపాల వద్ద ఏర్పాట్లు, గణనాథుడి పూజకు మార్కెట్‌లో వివిధ వస్తువుల కొనుగోలుతో ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో అంతా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

- రాంనగర్/కవాడిగూడ/నల్లకుంట/ ముషీరాబాద్/ చిక్కడపల్లి/ గోల్నాక/ అంబర్‌పేట/బర్కత్‌పుర, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి)



రాంనగర్‌లో మట్టిగణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న రాంనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వి.సుధాకర్‌గుప్తా, ఎర్రం శ్రీనివాస్ తదితరులు



రాంనగర్ మార్కెట్‌లో గణపతి విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు



లోటస్ స్కూల్ సమీపంలో చిన్నారులు ఏర్పాటు చేసిన గణనాథుడి మండపం



చిక్కడపల్లిలో అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో మట్టివినాయకప్రతిమలను పంపిణీ చేస్తున్న నాయకులు



కాచిగూడ డివిజన్ చప్పల్‌బజార్‌లో విశ్వంభర సిద్ధిలక్ష్మి గణపతికి రూ.6లక్షలతో నిర్వాహకులు వెండి కవచాలు తయారు చేయించారు. గణపతికి వెండి కిరీటాలు, తొండం, కర్ణాభరణాలు, హస్తాలంకరణ వస్తువులను తయారు చేయించారు. వినాయక చవితి సందర్భంగా బుధవారం ఈ కవచాలను గణపతికి అలంకరించనున్నారు.



వినాయకుడి పూజకోసం చిక్కడపల్లి మార్కెట్‌లో అమ్మకానికి పెట్టిన పండ్లు

ఉత్సవాలు విజయవంతం అయ్యేలా చర్యలు : ఏసీపీలు

చిక్కడపల్లి: ప్రశాంతంగా వినాయకచవితి ఉత్సవాలు విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చిక్కడపల్లి, గాంధీనగర్ ఏసీపీలు ఎల్.రమేష్‌కుమార్, ఎ.యాదగిరి తెలిపారు. మంగళవారం రాత్రి గాంధీనగర్ డివిజన్‌లోని గోల్కొండ చౌరస్తాలోని ఓ హోటల్‌లో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి, బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో చిక్కడపల్లి, ముషీరాబాద్ సీఐలు బి.రాజునాయక్, రాంబాబు, ఎస్ఐ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్‌లోని స్ట్రీట్ నెంబర్ 18లో గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ లైటింగ్



మండపాల వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్



విద్యానగర్‌లో గ్రేటర్ వైశ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

భారీ పోలీసు బందోబస్తు

చిక్కడపల్లి ఏసీపీ రమేశ్‌కుమార్



చిక్కడపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి, ముషీరాబాద్ పీఎస్‌ల పరిధుల్లో వినాయకచవితి ఉత్సవాలకు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాల్లో మండపాలు ఏర్పాటు చేసుకునేవారు ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆయన చెప్పారు. ఇప్పటికే మండపాల నిర్వాహకులతో ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో సమావేశాలు సైతం నిర్వహించామని వివరించారు. ఉత్సవాలలో ఎలాంటి సందర్భంలోనూ కూడా డీజేలకు అనుమతి లేదని రోడ్ల మధ్యలో మండపాలు ఏర్పాటు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.



భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సెంట్రల్‌కమిటీ సభ్యుడు, పార్లమెంటు జేసీగా వినయ్‌కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న వైకుంఠం, ఆలె భాస్కర్



బతుకమ్మకుంటలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న సీపీఎం నగర నేత మహేందర్



బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు పార్కులో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, దిడ్డి రాంబాబు, బీజేపీ నేతలు



దేవాదాయ శాఖ సహకారంతో లలితానగర్‌లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న పావని ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు



చిక్కడపల్లిలో మట్టివినాయకులను పంపిణీచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

12న డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ, సభ

గోల్నాక, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గాన్ని డ్రగ్స్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని, ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా అందరినీ కలుపుకుని సెప్టెంబర్ 12న అంబర్‌పేటలో వేలాదిమంది విద్యార్థులు, యువకులు, ప్రజలతో కలిసి భారీర్యాలీ, సభను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో ఎమ్మెల్యే సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి అంబర్‌పేట జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌కు చేరుకుని, అక్కడ సభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రైవేటు పాఠశాలల యజమానులు ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కెంచె రవికుమార్, రాజశేఖర్ రెడ్డి, నిరంజన్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ను ఉపయోగించుకోవాలి

రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అర్హులందరూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని హిమాయత్‌నగర్ తహసీల్దార్ ప్రాంగణంలో 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ సంధ్యారాణితో కలిసి ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేసి, మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు త్వరగా వచ్చేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, నాయకులు శ్యామ్‌యాదవ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- కవాడిగూడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిరుపేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. కల్యాణలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను మంగళవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో కార్పొరేటర్ జి.రచనశ్రీ తహసీల్దార్ సంధ్యారాణితో కలిసి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు జి.వెంకటేష్ పరిమల్‌కుమార్, సలంద్రి దిలీప్‌యాదవ్, లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ బాలికల కోసం మరిన్ని ఒకేషనల్ సెంటర్లు

రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల బాలికల కోసం ఆంధ్ర మహిళా సభ ఒకేషనల్ కేంద్రం మాదిరిగా మరిన్ని సెంటర్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ పేర్కొన్నారు. విద్యానగర్‌లోని ఆంధ్ర మహిళా సభ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దివ్యాంగుల ఒకేషనల్ కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు వచన్‌కుమార్, వందనగౌడ్, చందనరాజ్, సరిత గోపాల్, ప్రేమలత అగర్వాల్, అపర్ణ బండి, టీపీసీసీ కార్యదర్శి జీ.ఎన్.కేశవ్, నాయకులు వెంకన్న, బల్వంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

లలితసంగీత విజేతలకు బహుమతుల ప్రదానం

చిక్కడపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): 26వ ఏపీ సావిత్ర లలిత సంగీత పోటీల విజేతల వివరాలను సంస్థ నవ్యనాటక సమితి ఉపాధ్యక్షుడు ఏవీ రామారావు మంగళవారం వివరించారు. సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతిని ఎ.శ్రీనమస్విత, ద్వితీయ బహుమతిని ఎ.యశస్విని, తృతీయ బహుమతిని సాత్విక గెలుచుకున్నారు. జూనియర్ విభాగంలో విశాల్‌అర్జున్, అలేఖ్యమాధవ పెద్ది, వీణా మధులిక, మేధాసాహితి, సుదీక్షచుండూరి, తనిష్క, శ్రీపజ్ఞ, మాన్యత సౌమ్య గెలుచుకున్నారన్నారు. సబ్‌జూనియర్ విభాగంలో హర్షిత్ రాఘవ, ఆశ్రిత్, సంహిత, ఆరోహి, అభిషిక్త, వేదప్రజ్ఞయ్, శ్రీహిత, శ్రీనిత, జనని గెలుచుకున్నారని తెలిపారు. విజేతలకు రాష్ట్ర ఖజానా, లెక్కలశాఖ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర, సంగీత కళాకారులు సురేఖామూర్తి, ప్రసన్నలక్ష్మి, జీవీ ప్రభాకర్ త్యాగరాయ గాన సభలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారని తెలిపారు.

దంతాలపై ప్రజలకు అవగాహన ఉండాలి

దత్తసాయి డెంటల్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్.రంగారెడ్డి

ఉచిత దంత వైద్య శిబిరం నేడు



డాక్టర్ ఎంఎస్.రంగారెడ్డి

నల్లకుంట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దంతాల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడంతోపాటు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు దత్తసాయి డెంటల్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్.రంగారెడ్డి వెల్లడించారు. బుధవారం గణేశ్ నవరాత్రి ఉత్సవం పురస్కరించుకుని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఎదురుగా గల దత్తసాయి డెంటల్ ఆస్పత్రిలో ఉచితంగా దంతవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం నల్లకుంటలోని దత్తసాయి డెంటల్ ఆస్పత్రిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరుప్రాయం నుంచే పిల్లలకు దంతాలపై అవగాహన కల్పిస్తూ తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ దంతాలపై నిర్లక్ష్యం వహిస్తే తర్వాత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఆహారంలో సమయపాలనతోపాటు దంతాలపై దృష్టి సారించినట్లయితే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండగలుగుతారని అన్నారు. రెండున్నర దశాబ్దాలుగా దంత వ్యాధులపై ప్రజలకు అవగాహన పెంపొందిస్తూ మెరుగైన సేవలు తమ ఆస్పత్రి అందిస్తుందన్నారు. దత్తసాయి డెంటల్ దంత వైద్యం లో ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో దంత వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యచికిత్స అందిస్తున్నామన్నారు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఎదురుగా గల దత్తసాయిడెంటల్ ఆస్పత్రిలో బుధవారం ఉదయం 10 నుంచి 5 గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఫోన్ 6301504150లో సంప్రదించాలని ఆయన కోరారు.

సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలి

న్యూఎరా కళాశాల సంకల్ప దివస్‌లో చిక్కడపల్లి సీఐ రాజునాయక్



మాట్లాడుతున్న చిక్కడపల్లి సీఐ రాజునాయక్, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్

రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కీలక ఘట్టం అని చిక్కడపల్లి సీఐ బి.రాజునాయక్ పేర్కొన్నారు. మంగళవారం చిక్కడపల్లిలోని న్యూఎరా కళాశాల సంకల్ప దివస్ - 2025 కార్యక్రమం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో న్యూఎరా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలు ఎవరైతే చెడు అలవాట్లకు లోనుకాకుండా, లక్ష్యాన్ని ఎంచుకుని చదువుతారో వారి భవిష్యత్ బావుంటుందన్నారు. ఎవరైతే ఇంటర్మీడియట్‌ను నిర్లక్ష్యం చేస్తారో వారి భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో 700 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి నాణ్యమైన విద్యనందిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

బర్కత్‌పుర ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైంది. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. చప్పల్ బజార్‌లో నివాసముంటున్న మురళి, గీత దంపతుల కుమార్తె హెచ్.దుర్గ(15) ఏడో తరగతి వరకు చదువుకొని, ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటుంది. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన దుర్గ తిరిగి రాలేదు. స్నేహితులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి గీత మంగళవారం రాత్రి కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

రాజకీయ కక్షతోనే సౌరభ్ భరద్వాజ్‌పై ఈడీ దాడులు :ఆప్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్‌పై ఈడీ దాడులను ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం లిబర్టీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆప్ నాయకులు బుర్రా రాములుగౌడ్, విజయ్ మల్లంగి, యమునగౌడ్, హేమ జిల్లోజు, జావీద్ షరీఫ్, శివాజీ, దర్శనం రమేష్, అజీమ్ బైగ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సౌరభ్ భరద్వాజ్‌పై వచ్చిన ఆరోపణలు, సోదాలు నిరాధారమైనవని, ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. బీజేపీ ఆప్ నాయకులపై నకిలీ కేసులు నమోదు చేయడం, జైలుకు పంపంపడం, వేధించడం చేస్తుందని ఆరోపించారు. బీజేపీ ఏకైక ఎజెండా 'మమ్మల్ని' అణచివేయడం, ఒత్తిడికి గురిచేయడం అయినప్పటికీ ఆమ్ ఆద్మీ పార్టీ భయపడదని ఆయన పేర్కొన్నారు.

శిథిలావస్థ ఇల్లును తొలగించండి

రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి నుంచి బాగ్‌లింగంపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా ఉన్న ఇల్లును వెంటనే తొలగించాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ రామానుజులరెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. మంగళవారం చిక్కడపల్లిలో వారు విలేకరులతో మాట్లాడారు. చిక్కడపల్లి మెయిన్ రోడ్డులోని ఇంటి నెంబర్ 1-8-401, 402 ఇల్లు నిర్మించి, దాదాపు 70, 80 సంవత్సరాలు దాటడంతో గోడలు బీటలువారాయని, కురుస్తున్న వర్షాల వల్ల కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. దీంతో పక్కనే ఉన్న తమకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అందులో మూడు మడిగెలు వ్యాపారాలు కొనసాగుతున్నాయని ఒక వేళ భారీ వర్షాలకు కూలితే అందులో ఉండేవారికి కూడా ప్రాణాప్రాయం ఉందని అధికారులకు విన్నవించామన్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్న ఇంటిని తొలగించాలని కోరారు. ఆ ఇంటిని తొలగించాలని యజమానికి మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదన్నారు.

చిక్కడపల్లి పీఎస్ మొబైల్ నెంబర్లు

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్‌తోపాటు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ అధికారుల మొబైల్‌ఫోన్‌నెంబర్లు ఇలా ఉన్నాయి. చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ నెంబర్ 8712660106, ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ నెం.8712660160, డీఐ ఎం.శంకర్ నెం.8712660161, అడ్మిన్ ఎస్ఐ అభిలాష్ నెం.8712660163, ఎస్ఐ శివప్రసాద్ నెం. 8712660162, ఎస్ఐ మౌనిక నెం.8712660166.